# నిప్పుపువ్వు




పి.వి.బి. శ్రీరామమూర్తి

ఒంటిగంట మధ్యాహ్నం.

వేసవి సూర్యుడు నడి నెత్తి నించి దాటిపోతూ మండిపోతున్న అడవిలా ప్రకాశిస్తూ, నిప్పులు కురుస్తున్నాడు. తాలిపోతున్న పెనంలాటి సిమెంటు రోడ్డుమీది నుంచి (చెప్పులు లేకుండా నడిచే) జనం నిప్పుల మీదినుంచి పరుగు తీస్తున్నట్టు నడుస్తున్నారు. తెల్ల బుష్కోట్లు, నీలి నిక్కర్లూ తొడుక్కున్న విద్యార్థులు అప్పుడే స్కూలునుంచి వస్తూ, వేగరంగా ఇంటికి చేరుకుందామని పరుగులు తీస్తున్నారు. వాళ్ళు పొక్కు లెక్క పోతూ, నెత్తి మాడిపోతూ ఉంటే ఇంక రోడ్డున నడవలేక ఏ చెట్టు నీడనో, కొట్టు నీడనో చేరుకున్న ముష్టి వాళ్ళు ఆ పూట ఆదాయాన్ని లెక్కపెట్టుకుంటున్నారు. అందులో ఓ ఎనిమిదేళ్ళ ముక్కు పచ్చలారని

ముష్టికొడుకు రంగడికి కడుపులో పేగులు కిరకిరా చుట్టుకుంటూ ఉండగా, నాలుక మీద తడి ఆరి పోతూండగా ఆ పూట ఆదాయం లోంచి ఓ పదిహేను పైసల్ని లెక్కపెట్టి తీసి కిళ్ళీ కొట్టు వాడి కిచ్చి సోడా తాగుతుండగా, వెనకా ల్నుంచి ఓ నలుగురు వాడి వయసు లోనే ఉన్న విద్యార్థులు రంగణ్ణి చూసి, "వీడే.. పట్టుకోండి. కదల్ని వ్వకండి." అని వాడి మీదకి పరిగెత్తుకుంటూ రావటం చూసి, వాడు తాగుతున్న సోడా పూర్తి కాకుండానే సోడా బుడ్డీ కొట్టువాడి కిచ్చి గబగబా పరుగుతీయసాగాడు. వాడి వెనకాలే ఆ పిల్లలు కూడా పరుగెత్తి వాణ్ణి ముందుకు అడుగు వెయ్యటానికి వీల్లేకుండా పట్టుకుని ఆపారు. వాడు బిక్కచచ్చి అందరి వేపు చూస్తుండిపోయాడు. మరి

---

వాడి చినిగిన చొక్కా, చేతిలో ముష్టి డొక్కూ- వాడికే అసహ్యకరంగా కనిపించాయి. వీటివల్ల తను ముష్టి వాడినని చెప్పకుండానే అందరికీ తెలిసిపోతోందని పించి డొక్కులో పైసాలు లెక్కెట్టుకుని, నిక్కరు జేబులో పడేసుకుని ప్రక్కనే ఉన్న మురికి కాలువలో డొక్కు కోపంగా విసిరేసాడు. ఎలాగైనా చదువుకోవా లన్న కోరిక మాత్రం వాడిలో ప్రబలమయింది.

---

కొంతమంది అదే వయసు విద్యార్థులు 'ఏమైందంటూ' రంగడిచుట్టూ చేరారు.

"ఏమయిందా? వీడివల్లనే మేం మాష్టారిచేత అనవసరంగా దెబ్బలు తిన్నాం. నంగనాచి వెధవ. వీణ్ణిలా విడిచి పెట్టకూడదు. నా పుస్తకాలు పట్టుకోండర్రా, చెప్తాను." అని అందులో కాస్త బలంగా ఉన్న ఓ అబ్బాయి ప్రక్కనున్న మరో అబ్బాయికి పుస్తకాలందిస్తూండగా, రంగడు బలంగా ఆ అబ్బాయి చేతుల్లో చిక్కుకున్న తన చేతిని విడిపించుకుని, ప్రక్కనే ఉన్న సందులోకి పరుగుతీసి, ఎటు పారిపోవాలో తెలియక అక్కడ ఉన్న చెత్తకుండీలోకి గెంతి, మీదని ఎంగిలాకుల్ని కప్పుకుని బితుకు బితుకుమంటూ కూర్చున్నాడు. ఆ నలుగురు పిల్లలూ సందులోకి వచ్చి చాలాసేపు వెతికి, ఎక్కడా కనిపించక పోయేసరికి అసహనంతో, "దొంగ వెధవ. దొరికాడు కాదు. లేకపోతే ఇవాళ పచ్చడి అయ్యుండే వాడు" అని ఉక్రోషంతో అక్కణ్ణించి వెళ్ళిపోయారు. చెత్తకుండీలో దాక్కుని ఉన్న రంగడు వీళ్ళందరి మాటలు జాగ్రత్తగా వింటూ వాళ్ళ మాటలు మరి వినిపించనంతవరకు అలానే కదలకుండా, మెదలకుండా ఉండిపోయాడు. తరువాత దాంట్లో నుంచి లేచి చూసి ఎవరూ కనిపించక పోయేసరికి గబగబా ఆ వీధి మలుపు దాటి వెళ్ళిపోయాడు.

అంతకు కొద్దిరోజుల క్రితం ఓ శనివారంనాడు-

రంగడు కూడా అందరు ముష్టి వాళ్ళ లాగానే 'ఈ రోజున ఇన్ని డబ్బులు దొరకాలి బగమంతుడా!' అని ఏడుకొండలవాడికి దండం పెట్టి, ఫోటో ముందు ఓ ఊదొత్తు పుల్ల వెలిగించి ముష్టికి బయలు దేరాడు. కాని, మొదటగా 'అమ్మా!' అని నోరెత్తి అడిగిన ఇంట్లోనుంచి ఓ తల్లి పైసాకూడా వెయ్యలేదు సరికదా, "ముష్టివెధవలు. శనివారం వచ్చేసరికి యమకింకరుల్లా తయారౌతారు" అని దభాల్న తలుపేసు కొని ఇంట్లోకి వెళ్ళిపోయింది. రంగడికి చాలా బాధనిపించింది. ఆవిడ తిట్టినందుకు మాత్రం కాదు. ఎందుకో, ఏమో వాడికి అర్థంకాదు గాని, వాడికీ జ్ఞానం తెలిసి ముష్టి అడుక్కోవటం ప్రారంభించిన దగ్గర్నుంచీ అలాటి విసుర్లూ, తిట్లూ అనుభవిస్తునే ఉన్నాడు. అయితే ముష్టికెళ్ళిన మొదటింట్లో 'లేదు' అని సమాధానం వస్తే మాత్రం ఆ పూట తిట్లు తప్ప మరెక్కడా ఏమీ దొరకదనే వాడి 'సెంటి

మోయి' పల్లె వాడికి కనిపించింది. అంతలోనే అక్కడికి దరి కొంచెం దూరంగా ఉన్న ఓ ఇంటి ముందు పొట్టవాళ్ళూ, గుడ్డివాళ్ళు 'దాత దయామయ, దాత దయామయ' అని పాట పాడుతుంటూ కనిపించారు. వాళ్ళలా పాడుతుండగా ఇంట్లోంచి ఓ పెద్దమనిషి వచ్చి వాళ్ళందర్నీ వరుసపెట్టి పైసలేస్తున్నాడు. రంగడు మధ్యలో దూర్చి ఇప్పుడే అక్కడికి పరుగెత్తాడు. అంతలోకే పైసా వేసి ఆ పెద్దమనిషి, "ఏరా? నీకేమయింది? కాళ్ళున్నా, కళ్ళున్నా గుడ్డా? వెళ్ళవా పో." అని గట్టిగా కసిరాడు. ప్రక్కనే ఉన్న ముష్టివాళ్ళు తమకి మాత్రమే ఆ అర్హత ఉన్నదని గొప్పగా భావించి, "బాగా చెప్పారు. దయగల తండ్రీ. ఈనా కొడుకులంతా ముష్టికి బయలుదేరబట్టే మమ్మల్ని కూడా ఎవ్వరూ సూడ్డం లేదు బాబయ్యా! ఎప్పుడో మీ లాంటి దయగల పెబువులు తప్ప." అని రంగణ్ణి తిడుతూ అక్కడ్నుంచి వెళ్ళిపోయారు. రంగడికి వాళ్ళ మీద బాగా కోపం వచ్చింది. కాని, వాళ్ళ వేపు చూడకుండా, "బాబూ! రెండు పైసలు దరమం సెయ్యి తండ్రీ, తల్లీ, తండ్రీ లేనివాణ్ణి బాబయ్యా.... రెండ్రోజుల్నుండి తిండి లేదు బాబయ్యా." అని కడుపు కొట్టుకుంటూ ప్రాధేయపడుతుండగా ఆ పెద్దమనిషి కోపంగా వాణ్ణి చూస్తూ, "ఏం వెధవా! దృఢంగా పోయి పని చూసుకోరాదూ? తిని తిరగా వెధవ బ్రతుకు బ్రతక్కపోతే. ఇదిగో ఇవాళేదో వేస్తున్నా. ఇక ముందు మళ్ళీ వచ్చినా, మరి వెయ్యను." అని రెండు పైసలు వేశాడు. రెండు పైసలు చేతికి అందుకుని వాడెంతో పొంగిపోయి ఆ ఇంటి నుంచి వెళిపోతూ ఉంటే. ఆ పెద్దమనిషి అన్నమాటలు గుర్తుకొచ్చాయి వాడికి. 'దృఢంగా పని చూసుకోరాదూ పోయి... వెధవ బ్రతుకు బ్రతక్కపోతే' అని. ఆ రోజంతా ఏ ఇంటి దగ్గర ఎవరు 'పో' అని పొమ్మన్నా ఆ పెద్దమనిషి మాటలే చెవుల్లో వినిపించసాగాయి. సాయంత్రం వాడు, వాడి గూటికి చేరుకుంటూ ఉండగా ఆ రోజు జరిగిన సంఘటనలన్నీ గుర్తుకొచ్చాయి వాడికి. ఉదయం నుంచి ఏ ఇంటికెళ్ళినా ముష్టి వేసిన వాళ్ళ కన్నా చీవాట్లు పెట్టిన వాళ్ళే ఎక్కువ కనిపించారు. ముష్టి అడుక్కొని బ్రతకటం అనేది చాలా నీచమైనదని వాడికి అప్పుడే తెలిసింది. ఆ మరుక్షణంలోనే చదువుకుంటే బాగున్ననిపించింది. 'బాగా చదువుకొని మంచి ఉద్యోగం చెయ్యాలని

కలకాలం బాగుండాలి,' అలా గంటూ పేవుడో, ఎవరో ఓ తల్లి తన పిల్లాణ్ణి ముద్దుపెట్టుకుంటూండగా తను చూసాడు. ఆ సంఘటన గుర్తుకొచ్చింది. 'బాగా చదువుకుంటే మంచి ఉజ్జోగం సంపాదించవచ్చు. అప్పుడు మంచి మంచి బట్టలు తొడుక్కోవచ్చు. తన అయ్యా, అమ్మా కూడా మరి వీధులంట తిరగక్కర్లేదు. అప్పుడెవరూ తిట్టరు.' వాడి లేత మనసులో తియ్యటి ఊహలు కదిలాయి. వేగిరంగా గూటికి చేరుకుని ఆ రోజు ఆదాయాన్ని తల్లి కిస్తూ, "అమ్మా, ఇయ్యాల్నుంచి నాన్నొచ్చినా ముట్టి కెళ్ళను." అన్నాడు తీవ్రమైన నిర్ణయంతో. వాడి తల్లి డబ్బులు లెక్కపెట్టుకుని బొక్కులో వేసి, "ఏంపిరా? ఊళ్ళొత్తావా?" అంది తాపీగా. "ఆఁ.... ఎలకూడదేటి?.... సదువుకుంటే." అన్నాడు.

"సదువా....బానో లాలాసో(వీ! ఇంతన్నావా?.... నీ కొడుకు సదువుకొని కలికిటేరొత్తాడు. మన కింకేటి లోటు!....బవంతుల్లో దిరగొచ్చు" అని దాని మొగుడితో చెప్పింది. ఇద్దరూ పక పకా నవ్వుతున్నారు. వాడి కప్పుడు వాళ్ళమీద పిచ్చరికా కోపం వచ్చింది. బుంగమూతి పెడుతూ, "ఏం? మనం సదువుకో రాదేటి?" అన్నాడు. రంగడి తల్లి నవ్వాపుకుంటూ, కోపంగా ఉన్న కొడుకుని దగ్గరగా తీసుకుని, "ఒరే....రంగా!....మన కెవులూ సెప్పర్రా సదువు. బాగా డబ్బున్నోళ్ళు....పెద్ద పెద్ద ఉజ్జోగస్తులూ....సదువుకోవాల.... మనం కూలి సేసుకోవాల. ఆ బగమంతుడు ముందే ఎవుళ్ళెలా బతకాలో ఆలోసించే పుట్టిత్తాడు" అని వాడి తల నిమిరింది ఆప్యాయంగా.

"మరి అలాగైతే కూలెందుకు సేసుకోనేడు?" తల్లి నడిగాడు రంగడు.

"ఓరి ఎదవా! కూలి సేసుకుంతే పగలల్లా రెక్కలిరుసుకున్నా రూపాయి డబ్బులు దొరకడం కష్టం. ముట్టికి పోతే 'సే' అని ఆ బిత్తినా తల్లి ముగ్గురికీ అయిదు రూపాయలు డబ్బులు దొరక్కపోవు, అల్లు 'సే' అనగానే మనిం వచ్చేరాడు. అల్లి సిగిపోయి డబ్బు లేసిందాకా అక్కడే పడేదాల" వేదాంతం బోధిస్తున్నట్లు వాడికి ముష్టి రహస్యాలు విడమర్చి చెప్తూంటే వాడికి వినాలనిపించలేదు తల్లి మాటలు. "మరియ్యాల పొద్దున్న ఓ మాసటాడ్డేమన్నాడో తెల్సా! 'సుబ్రంగా సదువుకోని అయిగా బతకమన్నాడు. నీ కెందు

కురా ఈ మట్టి బతుకు? ఎదవా!' అని. ఏమైనా నాను రేపట్నించి మట్టి కెల్లను. సదువుకుంతా నంతే." అని మొరాయిస్తూ కూర్చున్నాడు, తల్లి ఎన్ని విధాల చెపుతున్నా వినకుండా. వాని కెందుకో వాణ్ణి చూస్తుంటే భయంవేసింది. ఎవరైనా చిల్లంగి పెట్టేసారేమో ననుకుంది. రెండు మిరపకాయలు తెచ్చి దిగదుడిచి, మండుతున్న పొయ్యిలో వేసింది. చుట్టుప్రక్కల వాళ్ళందరూ ఆ గొట్రుకి పల్లమారి పోతున్నా దానికి మాత్రం గొట్రు రానట్టే అనిపించి. వాడి కెవర్లో దిష్టి పెట్టేసినట్లు ఆరాటపడిపోయింది.

* * *

ఆ రాత్రంతా వాడు ఆలోచిస్తూనే పడుకున్నాడు. వాడికో కమ్మని కల వచ్చింది. ఆ కలలో వాడు స్కూలు కెళ్ళి చదివి మంచి మార్కులతో పాసయినట్టు, ఏదో పెద్ద ఉద్యోగంవచ్చినట్టు, ముందుగా మట్టి వాళ్ళందరికీ బడి పెట్టి, అందులో చదివించుతున్నట్లు. అది నిజం అనుకుని సంబరపడిపోయి లేచి చూసేసరికి అది కల మాత్రమే అనుకుని వాడు దిగాలుపడిపోయాడు. తెల్లారేక వాడు లేచీ లేవగానే వాణ్ణి మట్టి కెళ్ళమని వాళ్ళమ్మ డొక్కు వాడిచేతికిచ్చినపుడు, "నేను మట్టి కెల్లను. సదువుకుంతాను." అనాలనిపించింది. కాని, అలా చేస్తే వాడి వీపు విమానం మోత మోగ్తుం దని భయంవేసి, కిమ్మనకుండా డొక్కు పట్టుకుని బయలుదేరాడు.

అక్కడ అక్కడ అంతా కలిసి పావలా డబ్బులు కూడిన తరువాత ముఖం కడుక్కుని టీ త్రాగటానికి వెళ్ళబోతుంటే వాడికి నీటుగా మంచి బట్టలు వేసుకుని, పుస్తకాల పెట్టి చేత్తో పట్టుకుని వెళ్ళిపోతున్న ఇద్దరు పిల్లలు కనిపించగా, వాళ్ళ వేపే ఆశగా చూస్తూ ఊరుకోలేక, "ఏయ్, బాబులూ!" అని వారిని పిలిచాడు. వారు వినిపించుకోకుండా వెళ్ళిపోతుంటే మళ్ళీ పిలిచాడు. వాళ్ళు వెనక్కితిరిగి 'ఏం' అన్నట్లు చూసారు. తీరా దగ్గరికి సమీపిస్తున్న రంగణ్ణి చూసి, "ఇప్పుడు మా దగ్గరేం లేదు. ఎక్కడపడితే అక్కడేనేం ముష్టి?" అని ఛీత్కరించుకుంటూ వెళ్ళి పోతుంటే, "బాబూ, ముష్టడగనేదు బాబులూ" అనిఅన్నాడుబాధగా "మరెందుకు?" ఇద్దరూ ఒక్కసారి అడిగారు వెను తిరిగి. "ఇయ్యాలపుడు బడికెల్తారా బాబూ?" అనడిగాడు.

"ఇవాళ బడి సెలవ్. ఆదివారంగా" అని వాళ్ళు ముందుకు పోబోతుంటే-

"సదువుకోడానికీ ఆదివారం సెలవేనా బాబూ? మరెందాకెల్తాన్నారు మీరు?" అన్నాడు రంగడు.

"ప్రైవేటు కెళ్తున్నాం."

"పెవేటుకా.... బాబూ....", అని, కొంతసేపు వాడికెలా చెప్పాలో తెలియక సతమతమై, "నానూ వత్తా! నాకూ సదువు నేరవాలనుంది" అన్నాడు.

"ఉత్తినే చెప్పరు. దానికి బోలెడు డబ్బు కట్టాలి" అని ఒక పిల్లవాడు అంటుండగా, "పదరా! టయిమయిపోయిందిప్పటికే" అని గబగబా వెళ్ళిపోతున్న వాళ్ళని ఇంకా పిలిస్తే కసరుకుంటారేమోనని భయంవేసి, వాడికున్న సందేహాలని మనసులోనే దాచేసుకున్నాడు. వాడికి తల్లి చెప్పిన మాటలు గుర్తుకొచ్చి అవి నిజమేనేమో ననిపించింది. 'అయితే ఆ పెద్దమనిషి మరెందుకలా చెప్పాడు?' అనే సందేహం మాత్రం వాడిలో మిగిలిపోయింది. తరువాత దగ్గర్లో కనిపించిన ఓ టీ దుకాణం దగ్గర ఓ టీ త్రాగి మళ్ళీ ముష్టికి బయలేరబోతుంటే.... ఇందాకా పిల్లలు వెళ్ళిన వేపే వెళ్తే బాగుండునని పించింది. అలాగ వాళ్ళు పోయిన వేపే వెళ్ళేసరికి, ఓ ఇంటిగుమ్మంలో కొంతమంది పిల్లలకి ఓ మాస్టారు పాఠం చెప్పటం చూసి అక్కడి కెళ్ళి ఆశగా నిలబడ్డాడు. "పో! ఇక్కడేం లేదు. ఇది ప్రైవేటు స్కూలు" అన్నారు పిల్లలు. వాడు కొంచెం ముందుకి ధైర్యంగా వెళ్ళి, "అదికాదండి! మరండీ.... నాకు సదువు నేర్చుకోవాలనుందండీ! మేట్ గోటూ.... నాకు సదువు నేరపరాండీ?" అన్నాడు. వాడలాగనేసరికి పిల్లలంతా ఘొల్లున నవ్వారు. మాస్టారు కూడా నవ్వి, "ముందో పదిహేను రూపాయ లివ్వగలవా?" అన్నారు. అది వినగానే వాడు పిడుగు పడినంతగా జడుసుకుని, మరికాస్సేపటికి తేరుకుని, "నాకాడ నేవండీ" అన్నాడు. "మరయితే పో" అని మాస్టారి నోటినుంచి రాగానే వాడు మరి అటువేపయినా చూడకుండా డొక్కు పట్టుకుని వెళ్ళిపోయాడు అవమానంతో. ముష్టిలేదని, తన డొక్కుని చేతిలోంచి లాక్కుని ఎంతోమంది దూరంగా విసిరేసినప్పుడు, ఆకల్తో కడుపు మాడిపోతున్నప్పుడు కూడా వాడికి బాధనిపించలేదుకాని, ఇలాగ ఇంతమంది ఒక్కసారి నవ్వి పొమ్మనేసరికి మాత్రం వాడికి చాలా బాధనిపించింది. వాడి చినిగిన చొక్కా, చేతిలో ముష్టి డొక్కు వాడికే అసహ్యకరంగా కనిపిం

చాయి. వీటివల్ల తను ముష్టివాడినని చెప్పకుండానే అందరికీ తెలిసిపోతుందనిపించి డొక్కులో పైసాలు లెక్కెట్టుకుని, నిక్కరు జేబులో పడేసుకుని ప్రక్కనే ఉన్న మురికికాలువలో డొక్కు కోపంగా విసిరేశాడు. ఎలాగైనా చదువుకోవాలన్న కోరిక మాత్రం వాడిలో ప్రబలమయింది. కొంత సేపు విచారంగా ఓ పాడుపడిన ఇంటిదగ్గర కూర్చుని మళ్ళీ ముష్టికి మరో వీధికి బయలుదేరాడు. అప్పుడే ఓ మాష్టారు బెత్తం పట్టుకుని కనిపించారు. ముందో పాతికమంది పిల్లలు కనిపించారు. ఆరిపోతున్న దీపానికి చమురుపోసినట్లుగా వాడిలో ఆశ జనించింది. ఈసారి తిన్నగా అక్కడికే వెళ్ళాడు. అక్కడ ఆ మాష్టారు ఓ పిల్లాడి చెవి మెలిపెడుతూ, ఎంత చెప్పినా వాడు చదవటం లేదని, తగిన శ్రద్ధ చూపక, చదువుకోటానికి దొంగ వేషాలు వేస్తున్నాడని గట్టిగా మొట్టికాయ పెట్టి, మోకాలిమీద నిలబడమని చెప్పారు. అలాటప్పుడు రంగడు, "మేష్టుగోరూ.... నమస్కారం అండీ!" అన్నాడు రెండు చేతులు జోడించి. మేష్టారు రంగడి ముఖంలోకి చూసి, "ఎవరబ్బాయ్ నువ్వు?" అని ప్రశ్నించారు. వాడు కొంచెం తటపటాయించి ధైర్యాన్ని కూడదీసుకుని, "నానండి.... మరండీ.... మా అయ్య ముష్టోడండి....మాయమ్మ ముష్టిదాయండి....అల్లేమో నన్నూ ముష్టికే ఎల్లమంటన్నారండి.... నాకంతే.... అంతే.... సదువుకోవాల్నుందండీ....ముష్టికెళ్తే అందరూ తిడతన్నారండీ" అని అంటూ చివరి మాటలు అంటున్నప్పుడు వాడికి చెప్పరాని దుఃఖం వచ్చేసి దాపురుకున్నాడు. మరికొద్దిసేపటికి తేరుకుని, "మీరు నాకు సదువు సెప్పరండీ మేష్టుగోరూ! నేను పదేను యియ్యనేను గానండీ, దాంచేస్తాను.... మాయమ్మకీ.... అయ్యకీ తెలకండ సూడబెట్టి" అన్నాడు రంగడు. వాడొచ్చి సదువు సెప్పమని అంతదైన్యంగా అడుగుతుంటే ఆ మాష్టారికళ్ళల్లో గిర్రున కన్నీళ్ళు తిరిగాయి. అతని మనసుని ఏదో వింత చేస్తున్నట్లుంది. అలాగే వాణ్ణే చూస్తూ ఉండిపోయారు. "మరి రాంత్రపూటా యలకి సదువు - సెప్పరాండీ!" అన్నాడు వాడు నిరాశతో.

"లేదు బాబూ! చెబుతాను. కాని, నిన్నుపదిహేనెవరు తెమ్మన్నారు?" అనడిగారు. వాడు కడుపునిండా తిండి దొరికిన రోజున ఆనందించిన

దానికంటే ఎక్కువ సంతోషించి, మేష్టారి పాదాలపై పడి, "మేట్ గోరూ! మీరెంతో మంచోరండీ!" అని నమస్కారం పెడుతూంటే, అతనికేదో వింతను చూస్తున్నట్లు అనిపించింది. "లేరా అబ్బాయ్! లే! ఇంతకీ నీ పేరు?" అని అడిగారు రామం మాష్టారు. "నా పేరండీ....రంగడంటారండీ...." అని సంతోషపడిపోతూ సమాధానం చెపుతోంటే, వాడికి చదువుకోమని సలహా ఇచ్చిన ఆ 'మాను బావుడు' భగవంతుడిలా కనిపించేసరికి మనసులో ఓసారి నమస్కరించేడతనికి.

"ఆఁ....నాకు నువ్వేం డబ్బులివ్వనక్కర్లేదుగాని.... పలకా, బలపం కొనుక్కోగలవా?"

"అయ్యేంతౌతాయండీ?"

"రూపాయి అవుతాయి"

"రేపు కొనట్టు కొత్తాన్నండీ!"

"రేపి పాటికిటుకుండె రావాలి! వచ్చేటప్పుడు శుభ్రంగా స్నానం చేసి, తల దువ్వుకుని రావాలిరా రంగా!" అని తక్కిన పిల్లలవేపు చూసి "చూడండ్రా! వెధవల్లారా.... వాడెంత ఉబలాట పడుతున్నాడో చదువుకోవటానికి! చదువుకోండ్రా నాయన్లారా! అని డబ్బులిచ్చి మీ వాళ్ళు మిమ్మల్ని పంపుతున్నా.... మీకు శ్రద్ధ లేకపోతోంది. వెధవలు.... వాణ్ణి చూసి సిగ్గు తెచ్చుకోండి" అక్కడ కూచున్న పిల్లలు ఇది చూసైనా బుద్ధొచ్చి బాగుపడతారని అన్నారు రామం మాష్టారు. వాళ్ళందరూ పిల్లి ఎలుకను చూసినట్లు రంగణ్ణి చూసారు. రామం మాష్టారే అక్కడ లేకపోతే వాడిని నిలువునా మింగేయాలన్నంత పౌరుషం వచ్చేసింది వాళ్ళందరికి. పళ్ళు పటపట కొరుకుతూ రంగణ్ణి చూసి చేసేదిలేక ఊరుకున్నారు. రంగడు వాళ్ళవేపే చూడకుండా మాష్టారికి మనస్ఫూర్తిగా నమస్కారం చేసి అక్కణ్ణించి వెళ్ళిపోయాడు. వాడికా రోజు ఆకలి ఏమాత్రంవెయ్యలేదు.మధ్యాహ్నం వాళ్ళయ్య, అమ్మని కూడా కలవకుండా అక్కడా అక్కడా డబ్బులు పోగుచేసుకుని, రూపాయి అవగానే ఓ దుకాణం దగ్గరకెళ్ళి ఓ పలకా, పుల్లా కొనుక్కున్నాడు. వాడికి చదువంతా అయిపోయి, ఉద్యోగం వచ్చేసినంత సంతోషం కలిగింది. ఆ సాయంకాలం యింటికెళ్ళి రామం మాష్టారి గురించి ఎంతగానో చెప్పెయ్యాలనుకున్న రంగడికి, డబ్బులు తేకుండా వచ్చినందుకు తనను వాళ్ళమ్మ చావబాది పలక నేలకేసికొట్టేస్తుందేమో

నని భయంవేసి, ఏమీ చెప్పకూడ దని నిర్ణయించుకున్నాడు. చీకటి పడకుండా ఇంటికిపోతూ, దారిలో ఓ తుప్పక్రింద పలకా, బలపం దాచిపెట్టి మిగిలిన అర్ధరూపాయితో వెళ్ళాడు. వాళ్ళమ్మ వాణ్ణి చూడ గానే "ఏందిరా? యియ్యాలెన్ని రూపాయలెచ్చినావేటి? మద్దేన్నం కూటికి కూడా రానేదు!" అని అడుగుతుంటే వాడికి నోట మాట రాలేదు. "అది కాదే.... ఇయ్యాల మూడ్రూపాయలు దొరికినాయే..." అని ఇంకా ఏదో అంటుండగా గాభరాగా, సంతోషంగా, "ఎయ్‌రా? ఇలాతే ముందు. అయ్యకి సెప్ప కుమీ....ఆడు తాగుబోతు ముండా కొడుకు" అని అంటుంటే వాడు భయం భయంగా తల్లి కళ్ళల్లోకి చూస్తూ "మరంటే....నానొస్తంటే ఎవడో తోవలో నాకాడ్డబ్బులన్ని నాక్కుని....నా నేడుస్తుంటే....ఈ అర్ధరూపాయి సేతులో నెట్టినాడు" అని జేబులోంచి అర్ధరూపాయి నాణెం తీసి తల్లి చేతిలో పెట్టాడు. "ఓరి నీ యమ్మ కడుపుగాల! ఎంత పని చేసినావ్‌రా! ఇయ్యాల్దాకా ఎందుకుండి పోనావ్‌రా! ఆడిల్లు గూల! ఆడికెలా అరుగుతాయో! ఆడి జిమ్మడ.... ఆడి సేతులు పడిపోనూ!" అని శాపనార్థాలు పెడుతూ అర్ధరూపాయి తీసుకొని ఊరుకుంది. పెద్దగండం గడిచినట్టయింది రంగడికి.

* * *

తెల్లవారి లేవగానే రోజూలాగా కాకుండా రామం మాష్టార్ని తలచుకుని దణ్ణం పెట్టుకుని, తరువాత వెంకటేశ్వరునికి మ్రొక్కుకున్నాడు రంగడు. నూతికెళ్ళి, స్నానంచేసి వచ్చి, తల శుభ్రంగా దువ్వుకుని తల్లితో ముష్టికని చెప్పి బయలు దేరి ముందురోజుంచిన పలకని జాగ్రత్తగా పట్టుకుని, అందరికంటే ముందుగానే వెళ్ళి వీధిగుమ్మంలో కూర్చున్నాడు. రామం మాష్టారు స్నానం ముగించుకుని వచ్చి తలుపు తెరచేసరికల్లా కనిపించిన రంగణ్ణి చూసి, "అరే! అప్పుడే వచ్చేసావే! అలాగుండాలి" అని వాడి పలక తీసుకుని అక్షరాల్ని వ్రాసి ఇచ్చి దిద్దమన్నారు. అవి దిద్దుతూ కూర్చుండగా పిల్లలంతా వచ్చారు. ఒక్కొక్కరూ కోపంగా చూస్తూ కూర్చున్నారు. వాళ్ళర గంట ఆలస్యంగా వచ్చినందుకు రామంమాష్టారు పాతిక గుంజీలు ఒక్కొక్కర్నీ తియ్యమని "రంగణ్ణి చూసి మీరంతా బుద్ధి తెచ్చుకోండి" అన్నారు. ఆ తరువాత మరి కొద్ది సేపట్లో రంగడు ఆ క్రొత్తగా

ఇచ్చిన అక్షరాల్ని చూడకుండా వ్రాసి యివ్వటంతో, వాణ్ణి రామం మాష్టారు మరింతగా మెచ్చుకున్నారు. దానితో తక్కిన పిల్లల్లో కోపం మరికొంచెం అధికమైంది. పిల్లలందరికీ రంగడిపై చాలా అసూయ కలిగింది. ప్రైవేటు వది లేసిన తరువాత రంగడు మాష్టారికి చెప్పేసి వెళ్ళిపోతుంటే, వాడి వెనకాలే కొంతమంది పిల్లలు వాణ్ణి అనుసరించి కొంతదూరంపోయాక "అరేయ్ రంగా! ఆగరా అక్కడ" అన్నారు. రంగడు అయోమయంగా నిలబడ్డాడు. వాళ్ళంతా తనవేపే కోపంగా చూస్తున్నట్లు కనిపించింది. రంగడి చుట్టూ అందరూ చేరారు. అందులో ఒకడు జేబులోంచి ఓ రూపాయి తీసి, "ఇదిగో, ఇది తీసుకో! రేపట్నుంచి నువ్వు రాకు ప్రైవేటుకి" రంగడికి వాళ్ళ మాటలర్థం కాలేదు.

"మీ రూపాయి నాకక్కర్లేదు. ఏం ఇచ్చినా నేను సదువు మాన్ను" అన్నాడు.

"మర్యాదగా చెప్తున్నాం. విన్నావో సరి. లేకపోతే కీళ్ళిరిచేస్తాం" అన్నారంతా.

"బాబుల్లారా! నానెవ్వరి జోలికీ పోనేదు గదా! నన్నెందుకిలా సంపుతారు? నన్నొదలండోయ్ బాబూ...." అని ఏడవటం మొదలు పెట్టాడు.

"ఒరేయ్! ఆ జోల్లి ఏడుపులు మానతావా లేదా? ఇవాల్టికి విడిచి పెడ్తున్నాం. రేపు నువ్వే కాని వచ్చావో నీ అంతు చూస్తాం. జాగ్రత్త" అని రంగణ్ణి విడిచి పెడుతూ, "ఇదిగో! మేం ఇలా అన్నట్లు మాష్టారికి తెల్సిందో.... మరి చూస్కో...." అని బెదిరించారు. వాడు చాలా భయంగా చూస్తూ, "చెప్పను" అని అక్కణ్ణించి ఎలాగో తప్పించుకుని వెళ్ళిపోయాడు. ఆ రాత్రల్లా వాడికి నిద్రపట్టలేదు. ఒళ్ళు వేడెక్కిపోయింది. రంగడితల్లి వాడి కాలిపోతున్న శరీరాన్ని చూసి జ్వరం వచ్చిందని గాభరా పడిపోయింది. రామం మాష్టారు వాడికి భగవంతునిలా కనిపిస్తుంటే, మరో ప్రక్క యమకింకరుల్లాంటి పిల్లలు కనిపించారు. 'ఏది ఏమైనా చదవటం మానను' యిది వాడి మనస్సు. 'చెప్పను. చెప్పను'అని రెండుసార్లు పలవరించటం చూసి పీడెక్కడో, ఏదో చూసి జడుసుకున్నాడని నిశ్చయించుకుంది రంగడి తల్లి. తెల్లారిలేవగానే తల్లి ఎంత వద్దన్నా వినకుండా ముష్టికని బయల్దేరి పలక పట్టుకుని రామం

మాష్టారింటికి అందరికంటే ముందే వెళ్ళి ఏడ్చుకుంటూ జరిగిందంతా చెప్పాడు. ఆ రోజు పిల్లలంతా రంగణ్ణి ఏం చేయాలన్నట్లు చూస్తుంటే రామంమాష్టారు రంగణ్ణి ఏడిపించిన నలుగురు పిల్లలని అరపైగ గుంజీలు తీయించి, రంగడి దగ్గర తప్పును ఒప్పుకోమన్నారు. తరువాత మరో పది నిమిషాలు అందరూ అన్నదమ్ముల్లా కలిసి బ్రతకాలని బోధించారు. ఆ తరువాత రంగడు వాళ్ళకెప్పుడూ ఒంటరిగా కనిపించలేదు. ఒంటరిగా కనిపిస్తే, రాకపోతే రామం మాష్టారి దగ్గర చదువు మానేసయినా వాడిమీద పగ తీర్చుకోవాలనుకుంటున్నారు. కాని, మరి కనిపించటంలేదు ఒంటరిగా ఎక్కడా!

ఇవాళే కనిపించినా గమ్మత్తుగా తప్పుకున్నాడు!

* * *

సమంగా ఒంటిగంట మధ్యాహ్నం.

ఎప్పట్లాగే స్కూలు పిల్లలు ఇంటికి చేరుకుంటున్నారుఎండలో. రంగడు ఇక అక్కడ ఉండకూడదు అనుకుంటూ వెళ్ళిపోతూండగా, ఎక్కణ్ణించి వచ్చారో కాని, ముగ్గురు పిల్లలు రంగణ్ణి చుట్టేసారు. ఎవరికి తోచినట్లు వారు పుస్తకాల పెట్టెలతోనూ, కారియర్లతోనూ నెత్తిమీద గట్టిగా మొత్తుతూంటే 'అమ్మో', 'బాబో' అని కేకలేస్తూ, వాళ్నించి తప్పించుకోటానికి ప్రయత్నించి వాళ్ళని విదిలించుకుని పరిగెత్తటం మొదలు పెట్టాడు. 'రామం మాష్టారి దగ్గరకి ప్రయివేటుకి రాను' అని వాడిచేత అనిపించడానికి వాళ్ళెన్ని విధాల ప్రయత్నించినా, ఫలితంలేని పిల్లలు వాడు తప్పించుకుని పారిపోతుంటే వాటి వెనకాల పరిగెత్తారు. ఎక్కడ లేని సత్తువనీ కూడదీసుకుని వెనక్కి ఓసారి తిరిగి చూస్తూ ప్రక్కనే ఉన్న సందు మలుపులోకి తిరిగి పరిగెత్తుతున్నాడు.

'ఈ విషయం ఎలాగైనా రామం మాష్టారితో చెప్పాలని ఉంది వాడికి. తనేమీ చెయ్యకపోయినా తనమీద అన్యాయంగా కక్ష కట్టిన ఈ స్కూలు పిల్లల్నిగూర్చి రామం మాష్టారికి చెప్పి తగిన విధంగా బుద్ధి చెప్పించాలనుకున్నాడు. ఎన్ని బాధలు పడైనా, ఎందరెన్ని అడ్డంకులు కలిగిస్తున్నా తప్పకుండా చదువుకుని తీరాలనుకుంటున్నాడు మనసులో. చదువుకోడానికెక్కడా నోచుకోలేనంత దరిద్రుడైనందుకు వాడికెంతో కోపంగా ఉంది. ఎలాగైనా ఈ ముష్టి బ్రతుకునించి

మారాలి, అనే ఆవేదన కూడా ఉంది. ఆ ఆలోచనలతోనే రంగడు ముందుకి పరుగు తీస్తూ జోరుగా వస్తున్న లారీని తప్పించుకోలేక పోయాడు. లారీ పెద్ద శబ్దం చేసుకుంటూ ఆగిపోయింది. ఆ శబ్దంలో రంగడి కోరికలు నలిగిపోయాయి.

జనం గుంపులు గుంపులుగా పోగయ్యారు. స్కూలు నుంచి వస్తున్న రామంమాస్టారు 'ఏమయిందని' ప్రక్కవాళ్ళ నడగ్గా 'ఎవరో స్కూలు పిల్లలు ఓ బిచ్చగాణ్ణి వెంట బడుతుంటే వాడు లారీకింద పడ్డాడు' అని వాళ్ళు చెప్పే సరికి రామం మాస్టారి గుండె ఝల్లుమంది. వెంటనే జనాన్ని తోసుకుని లోనికెళ్ళేసరికి-బలివేసిన మేకలాగ రక్తపు మడుగులో రెండుగా తెగి ఉన్న రంగడు! అతని హృదయం ముక్కలయిపోతోంది. తల దిమ్మెక్కిపోయింది. 'ఇది వీళ్ళ పనే!' అతను నోటినుండి అస్పష్టంగా వచ్చిన ఆ మాటలు ఎవరికీ వినిపించలేదు. 'ఆశల నిప్పు పువ్వుని అందుకోలేక ఆహుతైపోయిన తుమ్మెద - రంగడు!' రామం మాస్టారి కళ్ళు వేడి కన్నీళ్ళు కార్చాయి.

*


# విజయ చందా వివరాలు

| | |
|---|---|
| విడి ప్రతి : | 3-00 |
| అర్ధ సంవత్సర చందా : | 18-00 |
| సంవత్సర చందా : | 36-00 |
| జీవిత చందా : | 200-00 |